# నాటికి నేడు

రాత్రి ఒంటిగంట దాటిపోయింది... అయినా భానుమూర్తికి నిద్ర పట్టటం లేదు. మనసంతా దిగులుగా ఉంది!

తెల్లవారితే శీను ఢిల్లీ వెళ్లిపోతున్నాడు. మళ్లీ ఏ ఆర్నెల్లకో, ఏడాదికో వస్తాడు. వచ్చినా వారం రోజులో, పది రోజులో ఉంటాడు. తర్వాత, మళ్లీ తిరిగి వెళ్లక తప్పదు... ఇప్పటికే ఎన్నో సంబంధాలొస్తున్నాయి... ఉద్యోగం వచ్చేదాకా 'పెళ్లిప్రస్తావనే' వద్దని శీను అంటే ఊరుకున్నారు... ఇప్పుడిక తప్పదు... మంచి సంబంధం ఖాయం చేసి పెళ్లి చేసెయ్యాలి...! ఆ తర్వాత పిల్లలు పుట్టుకొస్తారు... దాంతో బాధ్యతలు పెరుగుతాయి... అప్పుడు శీనుకీ - తమకీ మధ్య దూరాభారాలు మరింతగా పెరిగిపోవచ్చు...!

అలాసాగిపోతున్న భానుమూర్తి ఆలోచనలు - శ్యామల పలకరింపుతో ఆగిపోయాయి.

"నిద్ర రావటం లేదా?"

"అవును శ్యామా! మన శీను రేపు వెళ్లిపోతున్నాడుగా?" - ఆమె వైపు తిరిగి చెప్పాడు.

"నాకూ దిగులుగానే ఉందండీ!... ఈ పాతికేళ్లలో మనం వాణ్ణి విడిచిపెట్టి పదిరోజులు కూడా ఎప్పుడూ ఉండలేదు... ఇప్పుడు ఏకంగా అంతదూరం వెళ్లిపోతున్నాడంటే - మళ్లీ ఎప్పటికొస్తాడో?... ఈ విశాఖపట్నంలోనే ఏదైనా ఉద్యోగం దొరికుంటే బాగుండేది!" నిట్టూరుస్తూ అంది శ్యామల.

"అక్కడ వాడికి జీతం ఎంతిస్తారో తెలుసా?... నెలకు నలభైవేలట!... అంత జీతం ఇచ్చే ఉద్యోగాలు ఈ ఊళ్లో దొరకటం కష్టం...పైగా వాడు చేరుతున్నది ఫారెన్ కంపెనీలోనట... రేపెపుడో ఆ కంపెనీవాళ్లు - మనవాణ్ణి అమెరికా పంపించే అవకాశం కూడా ఉందట...!" ఉత్సాహంగా చెప్పాడు భానుమూర్తి.

"పోన్లెండి... దేవుడు ఒక విధంగా మనకు అన్యాయం చేసినా - మరోవిధంగా దయచూపించాడు" - తృప్తిగా అందామె...

ఆ మాట శ్యామల చాలా తరచుగా అనుకుంటూంటుంది.

తమ పెళ్లయి నాలుగేళ్లయినా - అప్పట్లో వాళ్లకు సంతానం కలగలేదు. డాక్టర్లతో పరీక్షలు చేయించుకున్నారు. ఇద్దరిలోనూ ఎలాంటి లోపమూ లేదన్నారు. శ్యామల ఎన్నో నోములూ, వ్రతాలూ చేసింది. ఎంతో మంది దేవుళ్లకు మొక్కుకుంది... భార్యాభర్తలిద్దరూ

ఎన్నో తీర్థయాత్రలు కూడా చేశారు.

ఆ సందర్భంలోనే –

ఓసారి సింహాచలం అప్పన్ననీ, అన్నవరం సత్యనారాయణస్వామినీ, బెజవాడ దుర్గమ్మనీ దర్శించుకుని – ఏడుకొండల వెంకన్నను మొక్కకుందామని తిరుపతి బయల్దేరారు....

సాయంత్రం నాలుగ్గంటల వేళపుడు వాళ్లెక్కిన బస్సు దిగువ తిరుపతి చేరుకుంది.. కొండమీదకు వెళ్లే బస్సుకోసం 'డిపో'కి చేరుకున్నారు. వందలకొద్దీ జనాలు, అక్కడి 'కంపార్టుమెంట్ల'లో కూర్చుని వున్నారు. కొండపైనించి యాత్రికుల్ని తీసుకొచ్చే బస్సులు ఖాళీ అవగానే, కంపార్టుమెంట్లలో నిరీక్షిస్తున్న వాళ్లను – వరుసగా వాటిల్లోకి ఎక్కిస్తున్నారు.

భానుమూర్తీ, శ్యామలా – ఓ 'కంపార్టుమెంట్'లో కూర్చున్నారు. తాము బస్సు ఎక్కాలంటే కనీసం రెండు గంటలైనా నిరీక్షించాలని తెలుసుకున్నారు. పుస్తకాలమ్మే కుర్రాడి దగ్గర ఓ వారపత్రిక కొని తిరగేస్తున్నాడు భానుమూర్తి. బిస్కెటు ప్యాకెట్లూ, సోడాలూ, పాప్‌కారన్ ప్యాకెట్లూ అమ్ముకునే కుర్రాళ్లు హడావిడిగా తిరుగుతూ – మనిషి, మనిషి దగ్గరికీ వచ్చి మరీ అరుస్తున్నారు.

అంతలో 'టైమెంతయింది సార్?' – అంటూ తమ పక్కనే కూర్చున్న ఓ యువతి తననే అడిగినట్టుగా అనిపించి – అటు చూశాడు భానుమూర్తి.

ఆమెకు పాతికేళ్లుంటాయి... మనిషి కొంచెం నలుపే అయినా – కళ్లల్లో ఏదో ఆకర్షణ కనిపించింది. చదువుకున్న యువతి లాగే ఉంది. రిస్టువాచీలో టైం చూసి ఆమెకు చెప్పాడు.

"ఇంకా ఎంతసేపు కూర్చోవాలో ఏమిటో ఈ బస్సు కోసం?" – భుజంమీద పడుకుని నిద్రపోతున్న పిల్లాణ్ణి – ఒడిలోకి మార్చుకుంటూ – విసుగ్గా అనుకుందామె.

అప్రయత్నంగానే ఆ పిల్లవాడివైపు చూసిన భానుమూర్తి – కొన్ని క్షణాలపాటు తన చూపుల్ని మరల్చుకోలేక పోయాడు... వాడికి ఇంకా ఏడాది నిండివుండదు... బొద్దుగా ముద్దుగా ఉన్నాడు... దబ్బపండులాంటి రంగు... గుండ్రని ముఖం... విశాలమైన నుదురు... గిరజాల జుట్టు... రెండు చేతులకూ బంగారు మురుగులు...! 'చేతిలో వెన్నముద్ద, చెంగల్వ పూదండ.... బంగారు మొలత్రాడు'... వగైరాలతో కనిపించే బాలకృష్ణుడే భానుమూర్తి స్ఫురణకొచ్చాడు..

"బాబు పేరేమిటీ?" – వాడి చేతిని పట్టుకుని – అరచేతిలో ముద్దుపెట్టుకుని అడిగాడు.

"ఇంకా పేరు పెట్టలేదు సార్! ఎలాగా కొండమీదకు వెడుతున్నాం కదా... ఎల్లుండి పుట్టువెంట్రుకలు తీయించి – స్వామి సన్నిధిలోనే పేరు పెడతాం!" – వాడి నుదుటిమీద పడుతున్న గిరజాల జుట్టును వెనక్కి సవరిస్తూ చెప్పిందామె.

"మరి మీవారు...." అంటూ అడగబోయింది శ్యామల.

"రేపొద్దున్న కొండపైన మా ఫ్రెండు పెళ్ళుంది. పెళ్లికి రాకపోతే ఇక ఈ జన్మలో నన్ను చూడనని బెదిరిస్తూ ఉత్తరం రాసింది. అందుకే నేను ముందుగా బయల్దేరాను... మావారు రేపు రాత్రికి చేరుకుంటారు. ఎల్లుండి మొక్కు తీర్చుకున్నాక వెళ్లిపోతాం..." చెప్పిందామె.

ఈ కబుర్ల సందడితో బాబుకి నిద్రాభంగమైంది... కళ్లు తెరచి కలయ చూస్తున్నాడు.

"ఎంత ముద్దొస్తున్నాడో భడవ!" అంటూనే వాణ్ణి ఎత్తుకుని ముద్దాడింది శ్యామల.

"ఇంతకు ముందే పాలు తాగేడు... ఈ టవల్ వేసుకుని మరీ కూర్చోబెట్టుకోండి... ఎందుకైనా మంచిది!" – నవ్వుతూ టవల్ అందించిందామె.

వాడు శ్యామల ఒడిలో కూర్చున్నా – పక్కనే ఉన్న భానుమూర్తిని చూసి కేరింతలు కొట్టాడు. అతని కళ్లజోడు లాగేసి దాని భరతం పట్టే ప్రయత్నం చేశాడు... తర్వాత కాసేపు అతని మీసాల్తో ఆటలాడేడు... వాడి చిలిపి అల్లరికి ముచ్చటపడిన భానుమూర్తి – మరికొంతసేపు వాడితో ఆడుకోవచ్చునన్న ఆశకొద్దీ – బస్సురావడం మరింత ఆలస్యమైతే బాగుండుననుకున్నాడు.

అంతలో శ్యామల ఉలిక్కిపడ్డట్టుగా లేచింది...

"ఓరి భడవా! అన్నంత పనీ చేసేశావా" – అంటూ చీరకుచ్చిళ్లు దులుపుకుంది....

"అయ్యో.... మీ చీర తడిపేశాడా?" – నొచ్చుకుంటూ అడిగిందామె.

"ఫరవాలేదులెండి.... పది నిమిషాల్లో ఆరిపోతుంది... అయినా ఎంతో ప్రేమ ఉంటేనే చంటి పిల్లలు ఈ బహుమతీ ఇస్తారట...!" చెప్పింది శ్యామల, వాణ్ణి ముద్దుపెట్టుకుని.

మరో 'అరగంట' సమయం, వాడి అల్లరితో, కేరింతలతో 'అరనిమిషం'లా గడిచిపోయింది. అప్పటికి పైనించి వరుసగా నాలుగు బస్సులు వచ్చి ఆగేయి. వాళ్లు కూర్చున్న కంపార్టుమెంట్ గేటు తెరిచి బస్సెక్కమని చెప్పాడు కండక్టరు. అందరూ పొలోమని లేచి ఒకర్నొకరు తోసుకుంటూ బస్సువైపు నడిచారు.

"ఇంతకీ మీ పేరేమిటో చెప్పలేదు..."పిల్లవాణ్ని తిరిగి ఆమెకు అందిస్తూ అడిగింది శ్యామల.

"సరస్వతి!"

ఒక చేత్తో 'బ్యాగ్' పట్టుకుని – మరోచేత్తో బాబుని ఎత్తుకుని బస్సులోకి ఎక్కేందుకు ఆమె అవస్థపడుతుంటే – భానుమూర్తి సహాయంచేశాడు... ముందుగా లోపలకువెళ్ళి, ముందు వరుసలోనే కూర్చుండిపోయిందామె. భానుమూర్తి, శ్యామలా మూడో వరుసలో సర్దుకున్నారు...

టిక్కట్ల 'చెకింగ్' పూర్తవగానే బస్సు బయల్దేరింది. లోపల కూర్చున్న యాత్రికులందరూ - బిగ్గరగా గోవింద నామస్మరణ చేశారు.

శీతాకాలం పొద్దుకావటం చేత - ఇంకా ఆరైనా కాకుండానే - చీకట్లు వ్యాపించాయి. ఆ పల్చని చీకట్లో, చుట్టూ ఉన్న కొండలు తపస్సమాధిలో నిమగ్నమైన రుషి పుంగవుల్లా కనిపిస్తున్నాయి. బస్సులో యాత్రికులు 'స్వామి' వారి మహిమల గురించి చెప్పుకుంటున్నారు.

భానుమూర్తి దృష్టి మాత్రం బాబుపైనే వుంది. వాళ్లమ్మ ఒడిలో నిలబడి కదంతొక్కుతూ, అమె భుజాలపైనించి తనవైపే చూస్తూ, కేరింతలు కొడుతున్నాడు. వాడితో మరి కాసేపు ఆడుకోవాలన్న కోరికతో - ఆమె దగ్గర్నించి అందుకుని తన ఒడిలో కూర్చోపెట్టుకున్నాడు.

ఎవరి గొడవలో వాళ్లున్నారు. బస్సు ఘాట్‌రోడ్డులో వెడుతోంది.

అంతలోనే... మిన్ను విరిగి మీద పడినట్టుగా - ఓ భయంకరమైన శబ్దం...! బస్సులో ఉన్న జనం అంతా కలవరపడ్డారు... జరుగుతున్నదేమిటో భానుమూర్తి మరుక్షణంలోనే గ్రహించాడు... తాము ప్రయాణం చేస్తున్న బస్సు - ఆ రోడ్డులో ఓ చిన్న గోడను గుద్దేసి - పక్కనే ఉన్న లోయలోకి జారిపోతోంది... యాత్రికుల హాహాకారాలు మిన్నుముట్టేయి... ఒకరిమీద ఒకరు తూలిపడిపోతున్నారు.

"బాబూ...." అంటూ ముందు సీట్లో ఉన్న సరస్వతి పిలిచింది.

"మరేం భయంలేదు... నాదగ్గరే ఉన్నాడులెండి!" - అంటూ వాణ్ని తన గుండెలకు గట్టిగా హత్తుకున్నాడు. భానుమూర్తి.

ఆ తర్వాత మరికొన్ని క్షణాలకే - పెద్ద పెద్ద వృక్షాల్ని చీల్చుకుంటూ - భయంకరమైన శబ్దం చేస్తూ - "రెక్కలు తెగిన జటాయువు'లా ఓ పెద్ద బండరాయి మీద, నిలువునా కూలిపోయిందాబస్సు..

ఏడుపులు... పొలికేకలు...పిలుపులు... మిన్నుముట్టేయి.... పరిస్థితి గందరగోళంగా మారిపోయింది... పైగా చీకటి! భానుమూర్తి కాళ్లూ చేతులూ ఆడించాడు... బాగానే ఉన్నాయి... తనకేంకాలేదని తెలుసుకున్నాడు... తల మాత్రం దిమ్ముగా ఉండి... అంతటి మైకంలోనూ బాబును అలాగే గుండెలకు అదిమిపట్టుకుని - బలవంతంగా స్పృహ తెచ్చుకుని - భార్యను పిలిచాడు.

"మీ పక్కనే ఉన్నానండీ!" - భర్త భుజంపై చేయివేసి శ్యామల బదులిచ్చింది.

మరో పది నిమిషాలకల్లా-కాగాడాలు పట్టుకుని-చుట్టూ జనం చేరారు... ఇంకో అరగంటకు సహాయ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి... బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయిపోవటంతో, డ్రైవరుతో సహా నలుగురు ప్రయాణీకులు-ప్రాణాల్ని కోల్పోయారు.

మరో పదిమందికి గాయాలయ్యాయి....మృతదేహాలతో సహా ప్రయాణీకులందర్నీ–నెమ్మదిగా రోడ్డు మీదకు చేర్చారు...దేవస్థానం డాక్టర్లు వచ్చి గాయాలైన వారికి–అక్కడే చికిత్సలు చేశారు...

"ఏవండీ! సరస్వతి గారెక్కడ ఉన్నారో చూడండి!" కొంచెం ఓపిక తెచ్చుకున్నాక చుట్టూ కలియచూస్తూ చెప్పింది శ్యామల.

ఆమె కోసం భానుమూర్తి ఆత్రంగా చూశాడు... కనిపించలేదు... గాభరాగా రెండు మూడు సార్లు పిలిచాడు... బదులు రాలేదు!

"ఒక వేళ..." అతని మనసు కీడును శంకించింది.

"నో...! అలా జరగదు.... జరక్కూడదు స్వామీ!" అనుకుంటూ, గుండెను బిగపట్టుకుని రోడ్డుమీద వారగా పడుకోబెట్టిన మృతదేహాలవైపు నడిచాడు.

కానీ... అప్పటికే భగవంతుడు – తాను చేయాల్సింది చేసేసి – తమాషా చూస్తూన్నాడు...

ఆ మృతదేహాల్లో కనిపించిన సరస్వతిని చూసి దిగ్భ్రాంతుడయ్యాడు భానుమూర్తి. అతని నరాల్లో రక్తానికి బదులు 'భయం' ప్రవహించింది. తనకు తెలియకుండానే కన్నీళ్లు పెల్లుబికివచ్చాయి... 'బాబు'కి మాత్రం – తాను ఏం పోగొట్టుకున్నదీ తెలియక – జరిగిందేమిటో గ్రహించలేక – జరుగుతున్నేదేమిటో అర్థం కాక భానుమూర్తి చేతుల్లోనే ఉండిపోయి – అయోమయంగా చూస్తున్నాడు.

వాడి తల్లిపేరు మాత్రమే అడిగి – ఇతర వివరాలేమీ తెలుసుకోలేకపోయినందుకు భానుమూర్తీ, శ్యామలా బాధపడ్డారు...

"ఇప్పుడు బాబుని ఏం చేయాలీ?" ఇద్దరి మనసులోనూ ఒకటే ప్రశ్న....

"మీ బాబుకి ఏమీ కాలేదు కదా?" – అంతలోనే ఎవరో – భానుమూర్తిని పరామర్శించారు... వాడు చాలాసేపట్నించీ తన దగ్గరే ఉన్నాడు కనుక తమ కొడుకే అయ్యుంటాడని అందరూ భావించారు.

మరో గంట తర్వాత – మృతదేహాల్ని ఓ వ్యాన్‌లో ఎక్కించి, పోస్ట్‌మార్టం కోసం కిందనున్న ఆస్పత్రికి తరలించారు. మరో ప్రత్యేకమైన బస్సుల్లో, తక్కిన ప్రయాణీకుల్ని కొండమీదకు పంపించారు.

"బాబుని ఏం చేద్దాం?" – కొండమీద రూమ్‌లోకి వచ్చింతర్వాత అడిగింది శ్యామల.

"ఆ సరస్వతిగారు, తన స్నేహితురాలి పెళ్లి జరుగుతోందని చెప్పారు గదా?... రేపు పొద్దున్నే – పెళ్ళిళ్లు ఎక్కడ జరుగుతున్నాయో చూసి – పెళ్ళి కూతుళ్లను వాకబు చేస్తే – ఆవిడ వివరాలు 'ఈజీ'గా తెలిసిపోతాయి!"

"కానీ... శుభమా అని పెళ్ళి జరుగుతూంటే - ప్రాణస్నేహితురాలి మరణవార్త చెప్పటం ఏం బాగుంటుందీ? పైగా, తన పెళ్లికివస్తూ - ఇలా దుర్మరణం చెందిందంటే - ఆ పెళ్లికూతురు బాధపడుతుంది?" - అనుమానాన్ని వ్యక్తం చేస్తూ చెప్పింది శ్యామల

"అదీ నిజమే! అయితే... మనం వైజాగ్ వెళ్ళి తర్వాత పేపర్లో ప్రకటన ఇద్దాం.... అప్పుడు వీళ్ళనాన్న వచ్చి తీసుకెడతాడు!" -

అయితే శ్యామల మనసులో ఏమూలనో పేరుకున్న స్వార్థం అందుకు ఒప్పుకోలేదు. ఆమె ఆలోచనలు పరిపరివిధాల పరుగులు తీశాయి.

"ఏవండీ! మనకెలాగూ పిల్లలు పుట్టలేదు... ఇకముందు పుడతారన్న ఆశ కూడా కలగటం లేదు. మన కోరిక గ్రహించిన ఈ ఏడుకొండలస్వామే-మనకిలా ఈ బిడ్డను అనుగ్రహించాడని ఎందుకనుకోకూడదూ? వీడికి మనమే తల్లిదండ్రులం ఎందుకు కాకూడదూ?" - అడిగిందామె ఆశగా.

భానుమూర్తికి ఏం చెయ్యాలో, ఏం చెప్పాలో కూడా తెలియలేదు.

"ఎలా జరగాలని వుంటే అలాగే జరుగుతుంది! అంతా స్వామిదయ అనుకుందాం..." అంతలోనే ఆమె దేవుడికి దణ్ణం పెట్టుకుంటూ చెప్పింది మళ్లీ...

మర్నాడు స్వామిని దర్శించుకుని-బాబు తలనీలాల్ని సమర్పించి - తిరిగి విశాఖపట్నం చేరుకున్నారు. ఆ ఏడుకొండల వాని దయవల్లనే దొరికిన బిడ్డగా భావించి, వాడికి 'శ్రీనివాస్' అని పేరు పెట్టుకున్నారు. బంధుబలగాల్ని పిలిచి - దత్తత స్వీకారం చేసుకున్నారు. తమకు పిల్లలు కలగలేదుకనుక - అనాథాశ్రమంనించి వాణ్ణితెచ్చి పెంచుకుంటున్నట్టుగా అందరికీ చెప్పుకున్నారు...

ఈ పాతికేళ్లూ తమప్రాణాలన్నీ 'శీను' మీదనే పెట్టుకుని పెంచుకొచ్చారు... కన్న ప్రేమ కంటే పెంచిన ప్రేమ గొప్పదనే విషయాన్ని శ్యామల నిరూపించింది... తిరపతి కొండ మీద వాడు తమకు లభించిన రోజునే - ఇంతకాలంగా వాడి పుట్టినరోజు వేడుకను కూడా జరుపుతోంది...

శీను బాగా చదువుకున్నాడు. వృద్ధిలోకి వచ్చి ప్రయోజకుడై - ఇవాళ ఢిల్లీలో మంచి ఉద్యోగం సంపాదించుకున్నాడు. త్వరలోనే పెళ్లిచేసుకుని - వంశాన్ని నిలబెడతాడు.

అందుకే దేవుడు ఒకవిధంగా తమకు అన్యాయం చేసినా - మరో విధంగా దయ చూపించాడని శ్యామల పదేపదే అనుకుంటూంటుంది...

"ఏవండీ....! నిద్రపోతున్నారా?"- అంటూ శ్యామల తట్టిపిలిచేసరికి - గతం తాలూకు జ్ఞాపకాల పుటల్ని మూసేసి - వాస్తవానికి వచ్చాడు భానుమూర్తి.

"ఏమిటి శ్యామా?" అడిగేడు.

"మన శీను వెళ్లిపోతే ఇల్లంతా బోసిపోతుందండీ!... పైగా ఇంత పెద్ద ఇంట్లో మనిద్దరం బిక్కుబిక్కుమంటూ వుండాలి!... ఎవరికైనా ఓ వాటా అద్దెకిస్తే... ఆ వచ్చేవాళ్లతో మనకి కాస్త కాలక్షేపం అవుతుంది...!" సలహా ఇస్తున్న ధోరణిలో చెప్పిందామె.

ఆ ఆలోచన భానుమూర్తికి నచ్చింది... మర్నాడు శీను వెళ్లగానే - ఇంటి ముందు గేటుకి 'టు-లెట్' బోర్డు తగిలించాడు.

వారం రోజులు తిరక్కుండానే - ఆ ఇంటి వాటాలో రాఘవరావు దంపతులు అద్దెకు దిగేరు. రాఘవరావుకి బ్యాంకులో ఉద్యోగం... దేశంలో చాలా చోట్ల పనిచేసి, పదిరోజుల క్రితమే విశాఖపట్నం ట్రాన్స్‌ఫరైవచ్చాడు... వాళ్ళకు ఒక్కడే కొడుకు... హైదరాబాద్‌లో మెడిసిన్ చదువుతున్నాడు... రాఘవరావు ఆ వాటాలో అద్దెకు దిగేముందే ఆ వివరాలన్నీ సేకరించాడు భానుమూర్తి... రాఘవరావు భార్య శకుంతల చాలా కలివిడి మనిషి... వచ్చిన రెండ్రోజులకే, శ్యామలతో స్నేహం కలిపేసుకుంది...

మూడో రోజు సాయంత్రం - మొక్కలకు నీళ్లు పోస్తున్న భానుమూర్తి దగ్గరకు వచ్చాడు రాఘవరావు.

"రేపు ఆదివారం కదా! మా ఇంటికి 'బ్రేక్ ఫాస్ట్'కి రండి!" - అంటూ ఆహ్వానించాడు... మర్నాడు పొద్దున్నే 'రెడీ' అయి వెళ్లాడు భానుమూర్తి...

ఇద్దరూ 'డైనింగ్ రూం'లో కూర్చున్నారు... శకుంతల టిఫిన్ తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టింది... టిఫిన్ తింటూనే యధాలాపంగా చుట్టూ చూస్తున్న భానుమూర్తి చూపులు కొంచెం దూరంగా గోడమీదనున్న ఫోటోపై నిలిచిపోయాయి...

ఆ ఫోటోకి దండవేలాడుతోంది. ఆ ఫోటోలో నవ్వులు ఒలకపోస్తూ ఓ యువతి!... ఆమెను ఎప్పుడో, ఎక్కడో చూసినట్టు అనిపించి - గుర్తుచేసుకునే ప్రయత్నంలో అలాగే చూస్తూండిపోయాడు...

"ఏమిటలా చూస్తున్నారూ?" - అడిగేడు రాఘవరావు...

"అదే... ఆ ఫోటోలో ఉన్నామె..."

"మా ఆవిడ! అయ్‌మీన్ నా మొదటి భార్య సరస్వతి! పాతికేళ్ళక్రితం తిరుపతి వెడుతూ బస్సు యాక్సిడెంటులో చనిపోయింది!" భానుమూర్తి పూర్తిగా అడక్కుండానే చెప్పాడు రాఘవరావు.

భానుమూర్తి ఉలిక్కిపడ్డాడు... గతమంతా అతని కళ్ళముందు కదిలింది... ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

'అయ్యో!... అలాగా?" అన్నాడు ఎలాగో గొంతు పెగల్చుకుని.

శకుంతల కాఫీ కప్పులు తెచ్చి బల్లమీద పెట్టింది.

"ఇదిగో!... ఆ తర్వాత ఈవిడగార్ని కట్టుకున్నాను... పేరు శకుంతల!" - అంటూ పరిచయం చేశాడు రాఘవరావు...

భానుమూర్తిలో టెన్షన్ ఎక్కువైంది... రాఘవరావు తన మొదటి భార్య గురించే చెప్పాడు... మరి ఆమెకు పుట్టిన బాబు గురించి ఎందుకు చెప్పలేదో!...

'మీ మొదటి భార్యకి... అదే సరస్వతి గారికి పిల్లలు లేరా?" ఒత్తిడి భరించలేక తనే అడిగేశాడు...

"ఓ బాబు పుట్టేడు! ఎంత ముద్దుగా వుండేవాడో!... కానీ విధి చాలా విచిత్రమైంది భానుమూర్తి గారూ!... నావల్ల సరస్వతికి సంతానం కలిగింది... బట్... ఈవిడకు మాత్రం ఆ యోగం లేకపోయింది!" - బరువుగా నిట్టూర్చాడు రాఘవరావు.

"మీ మాటలు నాకు అర్థం కావటం లేదు... సరస్వతి గారికి పుట్టిన బాబు..." అంటూ ఆగిపోయాడు భానుమూర్తి... ఆ బాబు ఏమైంది తనకు తెలుసు.... కానీ రాఘవరావు ఏమనుకుంటున్నదీ తెలుసుకోవాలి!... అందుకే రాఘవరావు చెప్పే జవాబు కోసం ఉత్కంఠతో ఎదురుచూశాడు.

"వాడూ నాకు దక్కలేదండీ!... ఆ 'యాక్సిడెంటు'లో వాడు ఏమైపోయాడో తెలియలేదు... బస్సు లోయలో పడిపోవటం వల్ల - అందులోంచి వాడు కిందకు జారిపోయాడేమోననీ - మనుషుల్ని పెట్టి వెతికించాను... ప్రయోజనం లేకపోయింది... వాడే దొరికుంటే- పెరిగిపెద్దయి, ప్రయోజకుడై వుండేవాడు" చెప్పాడు రాఘవరావు...

"మరి మీ అబ్బాయి హైదరాబాద్‌లో మెడిసిన్ చదువుతున్నాడని చెప్పారు కదా?"

"అవును!... మాకు సంతాన యోగం లేదని తెలుసుకున్నాక అనాథాశ్రమం నించి ఓ పిల్లాణ్ణి పెంపకానికి తెచ్చుకున్నాం!... రేపెప్పుడో మాకు తలకొరివి పెట్టటానికి తప్పదుగా..."

భానుమూర్తి అతనివైపే చూస్తూండిపోయాడు. మనసంతా భారంగా మారిపోయింది.

"నా గొడవంతా చెప్పి మీకు 'బోర్' కొట్టించానేమో! కాఫీ తీసుకోండి!" ఓ కాఫీకప్పు అతని ముందుంచుతూ అన్నాడు రాఘవరావు.

"అబ్బే... నేను కాఫీ తాగనండీ!... అలవాటు లేదు!" అంటూ, భానుమూర్తి మరి అక్కడ వుండలేక వచ్చేశాడు.

"వచ్చే నెలలో వాటా ఖాళీచేయమని రాఘవరావు గారికి చెప్పాలి!" అన్నాడు ఆ రాత్రి శ్యామలతో...

"అదేం? ఆయన మీకు నచ్చలేదా?" నవ్వుతూ అడిగింది శ్యామల... ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు భానుమూర్తి!!

(విపుల- ఆగస్ట్ - 2005)